రాబడి



ఇలా.. ప్లాన్ చేసుకోండి

సీనియర్ సిటిజన్ల పెట్టుబడికున్న 10 అత్యుత్తమ మార్గాలివే

ఆర్థిక ప్రణాళికలో పొదుపు, పెట్టుబడులకు అత్యంత ప్రాధాన్యత ఉంటుంది. అవగాహన, వివేకంతో ముందుకెళ్తే ఆకర్షణీయ స్థాయిలో రాబడులను పొందవచ్చు. ఇక సాధారణ సిటిజన్స్‌తో చూస్తే సీనియర్ సిటిజన్ల పెట్టుబడులకున్న 10 అత్యుత్తమ మార్గాలను ఒక్కసారి పరిశీలిస్తే వాటిలో..

ఈటీఎఫ్‌లంటే ఏంటో తెలుసా?

- ఈటీఎఫ్‌లు ఈక్విటీ, డెట్, కమోడిటీస్ వంటి వివిధ రకాల సాధనాల కోసం అందుబాటులో ఉంటాయి.
- సాధారణంగా వీటికయ్యే వ్యయభారం తక్కువే. అయితే ఈటీఎఫ్‌ల క్రయవిక్రయాల్లో బ్రోకరేజీ ఫీజులు, ఇతరత్రా ట్రేడింగ్ ఖర్చులు తప్పవు.
- ట్రేడింగ్ జరిగే రోజున ఈటీఎఫ్‌లను నాటి మార్కెట్ ధరల వద్దే కొనవచ్చు.. అమ్మవచ్చు.
- ఒక సూచీ ప్రదర్శనను ప్రతిబింబించడమే ఈ ఈటీఎఫ్‌ల లక్ష్యం.
- మ్యూచువల్ ఫండ్స్‌తో పోల్చితే దేశంలో అందుబాటులో ఉన్న ఈటీఎఫ్‌లు పరిమితం.
- ఆన్‌లైన్ బ్రోకర్లు, సంప్రదాయ బ్రోకర్-డీలర్ల ద్వారా ట్రేడ్ అవుతాయి.
- ఇండివీడ్యువల్స్ తమ రిటైర్మెంట్ ఖాతాల్లోనూ వీటిని కొనవచ్చు.

1

- **సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీం**

పదవీ విరమణ పొందినవారు ఎక్కువగా ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ల గురించే ఆరా తీస్తూ ఉంటారు. సురక్షిత, స్థిరమైన ఆదాయ వనరును కోరుకుంటారు. అలాంటి వాటిలో సీనియర్ సిటిజన్ సేవింగ్ స్కీం (ఎస్‌సీఎస్‌ఎస్) ఒకటి. ఇదో కేంద్ర ప్రభుత్వ పథకం. పూర్తిగా రిస్క్ లేని రుణ సాధనం. 60 ఏండ్లు, ఆపై వయసువారి కోసమే తెచ్చారు. ప్రస్తుత వడ్డీరేటు 8.20 శాతం. ప్రతీ 3 నెలలకోసారి సవరిస్తారు. కనీస పెట్టుబడి రూ.1,000, గరిష్ఠం రూ.30 లక్షలు. ఈ స్కీం గరిష్ఠ పరిమితి 5 ఏండ్లు. ఈ పెట్టుబడి మొత్తాలు పన్ను పరిధిలోకి రావు. అయితే వీటిపై పొందే వడ్డీ ఆదాయం వారివారి ఐటీ స్లాబుల ప్రకారం చెల్లించాల్సి ఉంటుంది.

2

- **పోస్టాఫీస్ మంత్లీ ఇన్‌కమ్ స్కీం**

తపాలా శాఖ అందించే ఈ స్కీంలో పెట్టుబడుల కుగాను నెలనెలా నిర్ణీత స్థాయిలో వడ్డీ ఆదాయాన్ని పొందవచ్చు. రిటైర్మెంట్ వయసులో ఆర్థిక భద్రతకు చక్కని అవకాశం. అయితే సీనియర్ సిటిజన్లకే కాదు.. 10 ఏండ్లు దాటిన భారతీయ పౌరులెవరైనా ఇందులో పెట్టుబడులకు దిగవచ్చు. దీని వార్షిక వడ్డీరేటు 7.40 శాతంగా ఉన్నది. ప్రతీ 3 నెలలకోసారి మారడానికి ఆస్కారం ఉన్నది. కనీస పెట్టుబడి రూ.1,500. గరిష్ఠ పెట్టుబడి రూ.4.5 లక్షలు. జాయింట్ అకౌంట్‌లో రూ.9 లక్షలదాకా పెట్టుబడులు పెట్టవచ్చు. కాలపరిమితి 5 ఏండ్లు. ఆ తర్వాత మరో 5 ఏండ్లు కూడా పొడిగించుకోవచ్చు. వడ్డీ ఆదాయంపై పన్నులుంటాయి.

3

- **ఫిక్స్‌డ్ డిపాజిట్లు**

రెగ్యులర్ ఫిక్స్‌డ్ డిపాజిట్లే (ఎఫ్‌డీ) ఇవి. బ్యాంకుల్లో సాధారణ పౌరులతో పోల్చితే సీనియర్ సిటిజన్లకు ఆయా కాలపరిమితుల ఎఫ్‌డీలపై వడ్డీరేట్లు ఎక్కువగా లభిస్తాయి. ఆదాయ పన్ను (ఐటీ) చట్టంలోని సెక్షన్ 80సీ కింద ఎఫ్‌డీలలో పెట్టుబడులకు పన్ను మినహాయింపున్నది. ఏటా రూ.1.5 లక్షలదాకా పన్ను ఆదా చేసుకోవచ్చు. అలాగే నెలవారీగా, 3 నెలలవారీగా, వార్షిక ప్రాతిపదికన నగదునూ పొందవచ్చు. మార్కెట్ రిస్కులకు దూరంగా ఉంటూ సురక్షితమైన పెట్టుబడులను, స్థిరమైన ఆదాయాన్ని ఆశించేవారు ఈ ఎఫ్‌డీలను పరిశీలించవచ్చు.

4

- **సిస్టమ్యాటిక్ డిపాజిట్ ప్లాన్**

సిస్టమ్యాటిక్ డిపాజిట్ ప్లాన్‌లో సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్), ఫిక్స్‌డ్ డిపాజిట్ (ఎఫ్‌డీ) ఫీచర్లుంటాయి. ఒకేసారి పెద్ద మొత్తాల్లో డిపాజిట్లకు బదులు చిన్నచిన్న మొత్తాల్లోనూ డిపాజిట్లకు ఇందులో వీలుంటుంది. నెలనెలా మనం చేసే ప్రతీ డిపాజిట్‌ను ఓ ఎఫ్‌డీగానే చూస్తారు. తక్కువలో తక్కువగా రూ.5వేలతో ఈ మంత్లీ డిపాజిట్లను ప్రారంభించవచ్చు. ఇక ఇందులో రెండు వేరియంట్లుంటాయి. ఒకటి సింగిల్ మెచ్యూరిటీ స్కీం, మరొకటి మంత్లీ మెచ్యూరిటీ స్కీం. వార్షిక వడ్డీరేట్లు 8.50 శాతందాకా ఉన్నాయి. ఏడాది నుంచి ఐదేండ్ల కాలపరిమితితో పెట్టుబడులు పెట్టవచ్చు.

5

- **నేషనల్ పెన్షన్ సిస్టమ్**

నేషనల్ పెన్షన్ సిస్టమ్ అనేది కేంద్ర ప్రభుత్వం అందించే రిటైర్మెంట్ సేవింగ్స్ స్కీం. పదవీ విరమణ కాలంలో స్థిరమైన ఆదాయ వనరుగా ఉంటుంది. సంఘటిత, అసంఘటిత రంగాల్లోని ఉద్యోగులకు ఇది చక్కని పథకమనే చెప్పవచ్చు. ఉద్యోగుల నుంచి, వారి సంస్థల తరపు నుంచి ఇందులోకి నగదు జమవుతుంది. ఐటీ చట్టంలోని సెక్షన్ 80సీ, సెక్షన్ 80సీసీడీ(1బీ) కింద పన్ను ప్రయోజనాలు దక్కుతాయి.

6

- **సీనియర్ సిటిజన్ ఎఫ్‌డీ స్కీం**

60 ఏండ్లు, ఆపై వయసున్నవారికి రెగ్యులర్ ఇన్‌కమ్‌ను అందించడానికి వచ్చినదే ఈ సీనియర్ సిటిజన్ ఫిక్స్‌డ్ డిపాజిట్ (ఎఫ్‌డీ) స్కీం. బ్యాంకులను బట్టి డిపాజిట్లకున్న కనీస, గరిష్ఠ పరిమితులు ఆధారపడి ఉంటాయి. కాలపరిమితి 7 రోజుల నుంచి 10 ఏండ్లదాకా ఉంటుంది. వార్షిక వడ్డీరేట్లు 9.75 శాతం వరకున్నాయి. అత్యవసర పరిస్థితిలో ఎఫ్‌డీని వెనక్కి తీసుకోవచ్చు. అయితే జరిమానాలను చెల్లించాల్సి ఉంటుంది. ఈ ఎఫ్‌డీల తనఖాపై రుణాలనూ పొందవచ్చు. మీ డిపాజిట్లపై రుణ మొత్తాలు ఆధారపడి ఉంటాయి. రూ.50వేల దాకా పన్ను మినహాయింపుంటుంది.

7

- **ట్యాక్స్ ఫ్రీ బాండ్లు**

ట్యాక్స్ ఫ్రీ బాండ్లలో పెట్టుబడి పెట్టేవారికి చెల్లించే వడ్డీకి పన్ను మినహాయింపు ఉంటుంది. ప్రభుత్వ రంగ కార్యక్రమాలు, ప్రభుత్వ సంస్థలు, మున్సిపల్ కార్పొరేషన్లు, ఇతర మౌలిక సదుపాయాల సంస్థలు ఈ బాండ్లను ప్రభుత్వం తరపున జారీ చేస్తాయి. కాబట్టి ఇదో భద్రత కలిగిన పెట్టుబడి సాధనం.

8

- **ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీం**

ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీం (ఈఎల్‌ఎస్‌ఎస్) అనేది ఓ ట్యాక్స్-సేవింగ్ మ్యూచువల్ ఫండ్ స్కీం. స్టాక్ మార్కెట్లు లేదా వాటి సంబంధిత సాధనాల్లో పెట్టుబడులను పెట్టడం జరుగుతుంది. అయితే ఇందులో రిస్క్ ఉంటుందన్న విషయం మరువద్దు. అయినప్పటికీ వేచిచూస్తే పెట్టుబడులపై మంచి ఆదాయాన్ని సొంతం చేసుకోవచ్చు. తక్కువ రిస్కుతో ఎక్కువ రాబడులను అందుకోవచ్చు మరి. ఇక ఐటీ చట్టంలోని సెక్షన్ 80సీ కింద ఏటా రూ.1.5 లక్షల దాకా పన్ను ఆదా చేసుకోవచ్చు. అయితే వీటిల్లో లాకిన్ పీరియడ్స్ ఉంటాయి.

9

- **మ్యూచువల్ ఫండ్స్**

మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులు మార్కెట్ రిస్క్‌లకు లోబడి ఉంటాయి. పెట్టుబడులు పెట్టే ముందే సంబంధిత డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం మంచిది. నిజానికి రిస్క్‌లకు దూరంగా ఉండాలనుకునే మదుపరులకు ఇవి పనికిరావు. ఈక్విటీ, రుణ మార్కెట్లలో మీ సొమ్మును మ్యూచువల్ ఫండ్స్ ఇన్వెస్ట్ చేయడమే ఇందుకు కారణం. అయితే ధైర్యంతో నిర్ణయాలు తీసుకుంటే దీర్ఘకాలంలో ఆకర్షణీయ రాబడులనే అందిస్తాయని చెప్పవచ్చు. కాబట్టి నిపుణుల సలహా మేరకు మీ ఇన్వెస్ట్‌మెంట్ పోర్ట్‌ఫోలియోలో మ్యూచువల్ ఫండ్స్‌కూ కొంత భాగం ఇవ్వవచ్చు. లాభాలపై మూలధన లాభాల పన్నులుంటాయి.

10

- **పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్**

సీనియర్ సిటిజన్లకు పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్) కూడా ఆకర్షణీయమైన పెట్టుబడి సాధనాల్లో ఒకటి. ఇదో సురక్షిత పెట్టుబడి మార్గం. పీపీఎఫ్‌లో పెట్టుబడి ఏటా రూ.1.5 లక్షలదాకా పన్ను ఆదాకు అవకాశాన్నిస్తుంది. పీపీఎఫ్ ఖాతా పరిమితి 15 ఏండ్లు.

లాభాల స్వీకరణకు అవకాశం!

దేశీయ స్టాక్ మార్కెట్లు వరుస లాభాల్లో దూసుకుపోతున్నాయి. మదుపరులు కొనుగోళ్ల జోష్‌లో ఉన్నారు. ఫలితంగానే గత వారం సూచీలు ఆల్‌టైమ్ హైల్లో స్థిరపడ్డాయి. ఈ క్రమంలోనే అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్‌ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 1,279.56 పాయింట్లు లేదా 1.57 శాతం ఎగబాకి మునుపెన్నడూ లేనివిధంగా 82,365.77 వద్ద నిలిచింది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్‌ఎస్‌ఈ) సూచీ నిఫ్టీ సైతం 412.75 పాయింట్లు లేదా 1.66 శాతం ఎగిసి తొలిసారి 25,235.90 దగ్గర ముగిసింది. కాగా, మార్కెట్లు నూతన గరిష్ఠాల వద్ద ఉండటంతో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణ దిశగా అడుగులు వేసే వీలుందని మెజారిటీ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. దీంతో ఈ వారం కరెక్షన్‌కు అవకాశాలు లేకపోలేదని అంటున్నారు. ఇక గ్లోబల్ స్టాక్ మార్కెట్లు, విదేశీ సంస్థాగత మదుపరుల పెట్టుబడులు, అంతర్జాతీయ పరిణామాలు, డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఈ వారం కూడా భారతీయ స్టాక్ మార్కెట్ల తీరును నిర్దేశించనున్నాయి. కాగా, అమ్మకాల ఒత్తిడి ఎదురైతే నిఫ్టీకి 24,850 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 24,600 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం 25,500-25,700 మధ్యకు నిఫ్టీ వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.

చివరగా..

స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. కాబట్టి ఇక్కడ ఒడిదొడుకులు చాలా సహజం. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఎటువంటి బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.

మహిళలు స్వయం సమృద్ధి సాధించాలి

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబర్ 1 : మహిళలు మరింత స్వయం సమృద్ధి సాధించాలని కేయూ ప్రొఫెసర్ మారోజు స్వర్ణలత అన్నారు. హనుమకొండ టీఎన్జీవోస్ భవన్‌లో క్రామాక్షి విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ మహిళా కో-ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షురాలు గుగ్గిళ్ల శశిరేఖ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకురావాలన్నారు. రాష్ట్ర విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ మహిళా సంఘం అధ్యక్షురాలు చిలుకూరి లక్ష్మీరామాచారి మాట్లాడుతూ.. సమాజ నిర్మాణంలో మహిళలదే పూర్తి బాధ్యతన్నారు. ప్రపంచ ప్రఖ్యాత చిత్రకారిణి, గిన్నిస్ బుక్ రికార్డు హోల్డర్ కాసుల పద్మావతి, తెలంగాణ రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ విశ్వకర్మ సంఘం ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణమాచార్యులు, తెలంగాణ రాష్ట్ర మహిళా విశ్వ బ్రాహ్మణ విశ్వకర్మ సంఘం గౌరవాధ్యక్షురాలు, మాజీ హస్తకళల బోర్డు డైరెక్టర్ నారోజు సత్యమనోరమ, ప్రధాన కార్యదర్శి రుద్రోజు భవానీ, హనుమకొండ, వరంగల్ విశ్వబ్రాహ్మణ మహిళా సంఘం అధ్యక్షురాలు కర్ణకంటి భారతి పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబర్ 1 : ప్రభుత్వాలు కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి వెంటనే పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహ దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్ ఎదుట తెలంగాణ ఉద్యోగ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే కాలంలో టీఈజేఏసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తుందన్నారు. టీజీవో రాష్ట్ర ఉపాధ్యక్షుడు అన్నమనేని జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ.. ప్రభుత్వం పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసేవరకు ఉద్యమాన్ని ఆపేది లేదని హెచ్చరించారు. పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, డీటీఎఫ్ రాష్ట్ర బాధ్యుడు లింగారెడ్డి, తెలంగాణ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సర్వర్ హుస్సేన్, ప్రభుత్వ పెన్షనర్ల అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, ఎస్‌టీయూ జిల్లా అధ్యక్షుడు రాంబాబు మాట్లాడారు. జూనియర్ లెక్చరర్ల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, పోలీస్ పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు మసూర్ హుస్సేన్, టీఆర్‌టీఎఫ్ అధ్యక్షుడు రాజబాబు, ఉద్యోగ, గెజిటెడ్ అధికారుల, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంఘాల నేతలు ప్రవీణ్, సదయ్య, పుల్లూరు వేణుగోపాల్, పనికెల రాజేశ్, మాలకొండారెడ్డి పాల్గొన్నారు.

ఒకరి అదృశ్యం

పరశురాములు(ఫైల్)

వేలేరు, సెప్టెంబర్ 1 : మద్యం తాగొద్దని చెప్పినందుకు భార్యతో గొడవపడి ఇంట్లో నుంచి భర్త వెళ్లిపోగా, మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు వేలేరు ఎస్సై అజ్మీరా సురేశ్ తెలిపారు. శనివారం ఇంట్లో ఫంక్షన్ ఉందని, మద్యం తాగొద్దని భార్య శ్యామల, కొడుకు అనిల్ పరశురాములుకు శుక్రవారం చెప్పారు. దీంతో భార్య, కొడుకుతో గొడవపడిన పరశురాములు అదే రోజు సాయంత్రం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటికి వెళ్లాడు. ఇప్పటి వరకు అతడి ఆచూకీ తెలియకపోవడంతో ఆయన బావమరిది ఉప్పర గట్టయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

నిట్ క్రీడావిజేతలకు బహుమతుల ప్రదానం

విజేతకు బహుమతి అందజేస్తున్న స్టూడెంట్స్ వెల్ఫేర్ డీన్

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబర్ 1 : మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని సందర్భంగా ఆగస్టు 26 నుంచి 31 వరకు నిట్‌లో కబడ్డీ, బాస్కెట్‌బాల్, టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్, చదరంగం వంటి ఆటలు నిర్వహించారు. విజేతలకు స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ శ్రీనివాసాచార్య, సెంటర్ ఫర్ స్పోర్ట్స్ యాక్టివిటీస్ హెడ్ రవికుమార్ బహుమతులు అందజేశారు.

దర్గాలో ఘనంగా 'సంధల్'

- వేలాదిగా తరలివచ్చిన భక్తులు
- కవ్వాలీ, నృత్యాలతో మార్మోగిన దర్గా ప్రాంగణం

బియాబానీ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న సీపీ అంబర్ కిశోర్ ఝా దంపతులు, పీఠాధిపతి ఖుస్రుపాషా

బియాబానీ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

కాజీపేట, సెప్టెంబర్ 1 : దర్గా కాజీపేటలోని హజరత్ సయ్యద్ షా అప్జల్ బియాబానీ దరాలో ఆదివారం అర్ధరాత్రి 'సంధల్' వేడుకలు ఘనంగా జరిగాయి. సంధల్ ఊరేగింపు అర్ధరాత్రి వరకు దర్గా పురవీధుల్లో కనుల పండువగా సాగింది.

దర్గా పీఠాధిపతి ఖుస్రుపాషా ఆధ్వర్యంలో పలు దర్గాల పీఠాధిపతులు బడేఘార్‌లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పీఠాధిపతి గంధం గిన్నెను దర్గాకు తీసుకువెళ్తుండగా గిన్నెను తాకేందుకు భక్తులు పోటీ పడ్డారు. డప్పుచప్పుళ్లు, ఫకీర్ల విన్యాసాలు, కవ్వాలీ, భజన కీర్తనలు, యువకుల నృత్యాలతో దర్గా ప్రాంతం మార్మోగింది. ఖుస్రుపాషా బియాబానీ సమాధికి గంధలేపనం చేసి ఫూల్ చాదర్ కప్పి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సీఐ సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.

దర్గాలో మంత్రి పొన్నం, సీపీ ప్రార్థనలు

దర్గా కాజీపేటలోని సయ్యద్ అప్జల్ బియాబానీ దర్గాను ఆదివారం రాత్రి మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి దర్శించుకున్నారు. పీఠాధిపతి ఖుస్రుపాషా వారికి స్వాగతం పలికి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అలాగే, సీపీ అంబర్ కిశోర్ ఝా కుటుంబ సమేతంగా పాల్గొని ప్రార్థనలు చేశారు.యువ పీఠాధిపతి భక్తియార్ బియాబానీ, మన్సూబ్ బియాబానీ, మాజీ కార్పొరేటర్ అబూబక్కర్ పాల్గొన్నారు.

బోనంతో పోచమ్మ దేవాలయానికి వస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ కుటుంబ సభ్యులు

పోచమ్మ తల్లికి దాస్యం ప్రత్యేక పూజలు

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబర్ 1 : వడ్డేపల్లి పోచమ్మతల్లికి దాస్యం వినయ్‌భాస్కర్ కుటుంబ సమేతంగా ఆదివారం బోనం సమర్పించారు. గ్రామదేవతల చల్లని దీవెనలు ప్రజలందరిపై ఉండాలని ప్రత్యేక పూజలు చేసినట్లు చెప్పారు.

వేయిస్తంభాల దేవాలయంలో రుద్రేశ్వరస్వామి కల్యాణోత్సవం జరిపిస్తున్న ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ

ఘనంగా రుద్రేశ్వరస్వామి కల్యాణోత్సవం

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబర్ 1 : చారిత్రక వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో శ్రావణమాస మాసశివరాత్రి సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వర్తించి ఆలయ నాట్యమంటపంలో రుద్రేశ్వరీ-రుద్రేశ్వరస్వామి కల్యాణోత్సవం వేదోక్తంగా నిర్వహించారు. 51 కిలోల పెరుగన్నంతో మహాన్నపూజ నిర్వహించి అమరలింగేశ్వరునిగా అలకరించినట్లు ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ తెలిపారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వేలాదిమంది భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ వేదపండితుడు గంగు మణికంఠశర్మ, ఈవో వెంకటయ్య పాల్గొన్నారు.

ఐలోని మల్లన్న ఆలయంలో..

ఐనవోలు, సెప్టెంబర్ 1 : ఐలోని మల్లికార్జునస్వామి ఆలయంలో మాస శివరాత్రి సందర్భంగా అర్చకులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి ఒగ్గు పూజారులు మెల్కోలుపు నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో పెద్ద పట్నం వేసి స్వామి వారి కల్యాణం నిర్వహించారు. ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్, ముఖ్య అర్చకుడు ఐనవోలు మధుకర్‌శర్మ, వేదపండితులు గట్టు పురుషోత్తమ శర్మ, విక్రాంత్ జోషి పాల్గొన్నారు.

ఐనవోలు మల్లికార్జునస్వామి ఆలయంలో రుద్రహోమం

ఐనవోలులో ఎద్దు తోకకు నరికిన గుర్తుతెలియని వ్యక్తులు

ఎద్దు తోకను నరికిన దుండగులు

ఐనవోలు, సెప్టెంబర్ 1 : గుర్తు తెలియని వ్యక్తులు మూగ జీవాన్ని హింసించి పైశాచిక ఆనందం పొందిన ఘటన మండల కేంద్రంలో జరిగింది. మండల కేంద్రానికి చెందిన బాధిత రైతు కొల ప్రకాశ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఐనవోలులోని తన వ్యవసాయ బావి దగ్గర శనివారం సాయంత్రం ఎద్దును కట్టేసి ఇంటికి వచ్చాడు. ఆదివారం ఉదయం బావి దగ్గరకు వెళ్లి చూడగా, గుర్తు తెలియని వ్యక్తులు ఎద్దు తోకను కట్‌చేసి పక్కన పడేసి వెళ్లినట్లు గుర్తించాడు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధిత రైతు తెలిపాడు.

ప్రమాదవశాత్తు వృద్ధురాలి మృతి

దుగ్గొండి, సెప్టెంబర్ 1 : ప్రమాదవశాత్తు పొలంలో పడి వృద్ధురాలు మృతి చెందిన ఘటన గిర్నిబావి గ్రామంలో జరిగింది. మందపల్లి గ్రామానికి చెందిన కొర్ర సమ్మక్క (75) మతి స్థిమితం సరిగా లేక పోవడంతో పలు గ్రామాల్లో తిరుగుతూ ఉండేది. శనివారం రాత్రి కురిసిన వర్షాలకు గిర్నిబావికి సమీపంలోని రైస్‌మిల్ ఎదురుగా ఉన్న కల్వర్టుపై కూర్చోబోతూ జారి పొలంలో పడి మృతి చెందింది. ఆదివారం ఉదయం స్థానికులు గమనించి సమాచారం అందించడంతో ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు తన సిబ్బందితో అక్కడికి వెళ్లి ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం అందజేసి, మృత దేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. ఆమె కుమారుడు సదయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మహిళలకు చీరెల పంపిణీ

తిరుమలగిరి గ్రామంలో మహిళలకు చీరెలను పంపిణీ చేస్తున్న ఏరుకొండ రవీందర్‌గౌడ్

ఆత్మకూరు, సెప్టెంబర్ 1 : తిరుమలగిరి గ్రామంలో మహిళలకు చీరెలను ఆత్మకూరు పీఏసీఎస్ చైర్మన్ ఏరుకొండ రవీందర్ పంపిణీ చేశారు. ఆదివారం పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా గ్రామంలో కేక్ కట్ చేసి స్వీట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు బూర రాజేందర్, నాగెల్లి సామేల్ పాల్గొన్నారు.

లండన్‌లో నాచినపల్లి వాసి మృతి

ప్రణయ్ (ఫైల్)

దుగ్గొండి, సెప్టెంబర్ 1 : ఉన్నత చదువుల కోసం లండన్ వెళ్లిన మండలంలోని నాచినపల్లికి విద్యార్థి మృతి చెందాడు. గ్రామానికి చెందిన దేవులపల్లి ప్రణయ్ ఏడాది క్రితం ఉన్నత చదువుల కోసం లండన్‌కు వెళ్లాడు. కొద్ది రోజులుగా తీవ్ర అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చేరాడని, ఆదివారం తెల్లవారుజామున పరిస్థితి విషమించి మరణించినట్లు అతడి తండ్రి రమేశ్ తెలిపారు. మృతదేహాన్ని స్వస్థలానికి తరలించడానికి భారత ఎంబసీ అధికారులు, ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, సహాయం చేయాలని వేడుకున్నాడు.

సమాజ మార్గదర్శకులు టీచర్లే..

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

శాయంపేట, సెప్టెంబర్ 1 : సమాజానికి మార్గ నిర్దేశకులు ఉపాధ్యాయులే అని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శాయంపేటకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు మహిపాల్ రెడ్డి ఉద్యోగ విరమణ సన్మాన సభ ఆదివారం జరిగింది. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి, మాజీ సర్పంచ్ ప్రకాశ్‌రెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణ రావు

సమావేశంలో మాట్లాడుతున్న సీఐ క్రాంతి కుమార్

గణపతి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

పరకాల, సెప్టెంబర్ 1 : గణపతి నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సీఐ క్రాంత